



APTEL/25/A5250

మన రాజధాని

# రక్షణ

ఎడిటర్ నరేంద్ర

నిజం మా బలం

గుంటూరు | సంపుటి -1 | సంచిక -97 | పేజీలు-4 | మంగళవారం 18 ఆగస్టు 2026 | వెల4/-


## తిరుమలలో వరుణయాగ నిర్వహణకు నిర్ణయం





## బీహార్ ఆలయ తొక్కిసలాట ఘటన

తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోడీ



# డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు

### నియామక ప్రక్రియ వివరాలన్నీ ఆన్ లైన్‌లోనే


- డీఎస్సీపై వైసీపీవి హిట్ అండ్ రన్ చర్యలు
- ఒడిశా కూలీలు, 90 ఏళ్ల జగన్ జెర్సీలతో ఫేక్ ప్రదర్శనలు
- ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని వైసీపికి సవాల్
- శాసనసభలో మెగా డీఎస్సీ నియామకాలపై సీఎం చంద్రబాబు ప్రసంగం

వివరాలు 2వ పేజీలో

## ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు

### ప్రాజెక్టుకలు వచ్చే నీళ్లు కూడా తగ్గిపోయాయి

- సాగు,తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి
- నీటిని పొదుపుగా వాడుకోవడం అవసరం
- అసెంబ్లీలో సిఎం చంద్రబాబు ప్రకటన





## ఎన్‌టిఏ తప్పులకు విద్యార్థుల మూల్యం

- సోషియాలజీ, ఇంగ్లీష్ పరీక్షల రద్దు దారుణం
- మండిపడ్డ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తీరుపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోమారు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూజీసీ-నెట్ పరీక్షలో సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ పరీక్షలను రద్దు చేసి సెప్టెంబర్‌లో మళ్లీ నిర్వహించాలని ఎన్‌టీఏ నిర్ణయించడంపై రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు. ఎన్‌టీఏ తప్పలకు వేలాది మంది విద్యార్థులు మూల్యం చెల్లించాల్సి వస్తోందని విమర్శించారు.

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు తొలి విమానం రాక


ఎక్స్ వేదికగా హర్షం వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు



వివరాలు 2వ పేజీలో

## 50 ఏళ్లలో గ్రూప్-1 లాంటి స్కామ్ చూడలే

అసెంబ్లీలో దీనిపై చర్చిస్తాం: సిఎం చంద్రబాబు





## రూ.500 కోట్లతో ఎంజేపీలకు శాశ్వత భవనాలు

### –శాసనసభలో మంత్రి సవిత

- రూ.80 కోట్లతో అసంపూర్తి ఎంజేపీల నిర్మాణం
- 6 బాలికల బీసీ గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్
- బీసీ బాలికల డ్రాపౌట్ల నివారణే లక్ష్యంగా అప్ గ్రేడ్
- కొత్తగా 10 బీసీ గురుకులాలు ఏర్పాటు
- సీఎస్ఆర్, డీఎంఎఫ్ ఫండ్స్ తో బీసీ హాస్టళ్ల అభివృద్ధి
- శిథిలమైన హాస్టళ్లను వేరే భవనాల్లో షిఫ్ట్ చేస్తున్నాం : మంత్రి సవిత

## ఏపి అభివృద్ధి గమ్యానికి కొత్తరెక్కలు

తొలి విమానం ప్రారంభంపై డిప్యూటీ సిఎం హర్షం



# అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహణ

- డిఎస్సీ అంటే అర్థం తెలియని వారి అర్థరహితీ విమర్శలు
- 148 రోజుల్లోనే డీఎస్సీ
- ఉద్యోగాల భర్తీ పక్రియ పూర్తిచేశాం
- ఇక నుంచి ఏటా ఉపాధ్యాయ నియామకాలు
- అసెంబ్లీలో డిఎస్సీపై నిర్వహణపై
- మంత్రి లోకేశ్ వివరణ





## యనమదురు డ్రెయిన్ సామర్థ్యం పెంపు

శాసనసభలో మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

## ఎన్‌టీఏ తప్పులకు విద్యార్థుల మూల్యం

మొదటి పేజీ తరువాయి

**న్యూఢిల్లీ,ఆగస్టు17(:** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తీరుపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోమారు ఆగ్రహం వ్యక్తం చేశారు. యూజీసీ-నెట్ పరీక్షలో సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ పరీక్షలను రద్దు చేసి సెప్టెంబర్‌లో మళ్లీ నిర్వహించాలని ఎన్‌టీఏ నిర్ణయించడంపై రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు. . జూన్ 22 నుంచి 30 వరకు సోషియాలజీ, ఇంగ్లిష్, కామర్స్ యూజీసీ-నెట్ పరీక్షలు జరిగాయి. దాదాపు రెండు నెలల తర్వాత ప్రశ్నపత్రాల్లో లోపాలు, గత ప్రశ్నల పునరావృతం కారణంగా ఈ మూడు పరీక్షలను ఎన్‌టీఏ రద్దు చేసింది. ఎన్‌టీఏ నిర్ణయం వల్ల ఏళ్ల తరబడి పరీక్షకు సిద్ధమైన వేలాది మంది అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేసుకోవడం, ఫీజులు చెల్లించడం, దూర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు ప్రయాణించాల్సి వస్తోంది. తప్పు చేసింది ఎన్‌టీఏ.. కానీ, శిక్ష అనుభవించేది మాత్రం విద్యార్థులా?' అని రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షా వ్యవస్థ విద్యార్థులను దోపిడీ చేసే వ్యవస్థగా మారిందని రాహుల్ ఆరోపించారు. దేశంలో సరైన పరీక్షా వ్యవస్థ లేదంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తాను కోటా, డెహ్రాడూన్, ప్రయాగ్‌రాజ్‌లలో ఇదే విషయాన్ని ప్రస్తావించానన్నారు. 'ఇది విద్యా వ్యవస్థ కాదు.. డబ్బు, కాలం, మానసిక ఆరోగ్యం, ఆత్మవిశ్వాసాన్ని తీసుకుని చివరికి ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని వ్యవస్థగా మారింది' అని రాహుల్ విమర్శలు గుప్పించారు. యూజీసీ-నెట్ ప్రశ్నపత్రాలు పరీక్షకు ముందే లీకయ్యాయా?' అని రాహుల్ గాంధీ సందేహం వ్యక్తం చేశారు. ఈ ప్రశ్నకు ఎన్‌టీఏ ఎందుకు సమాధానం చెప్పడం లేదని ప్రశ్నించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మొదటి అడుగు మాత్రమేనన్న రాహుల్ గాంధీ.. ఎన్‌టీఏ అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 'సెప్టెంబర్‌లో మళ్లీ పరీక్ష రాయనున్న ప్రతి విద్యార్థికి చెబుతున్నా.. మీరు సమస్య కాదు. పరీక్షను నిర్వహించలేని వ్యవస్థను ప్రధాని మోదీ ప్రభుత్వం నిర్మించింది. ఆ వ్యవస్థ చేసిన తప్పులకు ఇప్పుడు విద్యార్థులే బాధ్యులుగా చేస్తోంది. మీ విలువైన సంవత్సరాలు వృథా అవుతున్నాయి. దీనిపై మోదీ సమాధానం చెప్పే వరకు మేము ప్రశ్నిస్తూనే ఉంటాం' అని రాహుల్ గాంధీ అన్నారు.

## బీహార్ ఆలయ తొక్కిసలాట ఘటన

**న్యూఢిల్లీ,ఆగస్టు17** బీహార్ లఖిసరాయ్‌లోని అశోక్ ధామ్ ఆలయం వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ దిగ్భ్రాంతికి గురయ్యారు. తొక్కిసలాటలో ఏడుగురు మృతి చెందడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రమాదంలో గాయపడిన బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ప్రధాని పోస్టు చేశారు.బాధితులకు స్థానిక యంత్రాంగం సహాయం అందిస్తోంది' అని ప్రధాని మోదీ అన్నారు. మరోవైపు, బాధితులకు బిహార్ ప్రభుత్వం ఆర్థిక సాయం ప్రకటించింది. మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ప్రమాదం గురించిన వివరాలను లఖిసరాయ్ జిల్లా మెజిస్ట్రేట్ శైలేంద్ర కుమార్ వెల్లడించారు. శ్రావణ మాసం సందర్భంగా జలాభిషేకం చేసేందుకు వేలాది మంది భక్తులు అశోక్ ధామ్ ఆలయానికి చేరుకున్నట్లు తెలిపారు. దర్శనం కోసం మహిళలు, పురుషులు రెండు క్యూ లైన్లలో నిలబడి ఉండగా.. పురుషుల క్యూ లైన్‌కు సమీపంలో విద్యుత్ స్తంభం అకస్మాత్తుగా కూలిపోయిందన్నారు. స్తంభానికి ఉన్నది కేబుల్ వైర్ అయినప్పటికీ.. విద్యుత్ వైర్ అనే పుకారు క్షణాల్లో వ్యాపించిందని పేర్కొన్నారు. దీంతో తొక్కిసలాట జరిగిందని తెలిపారు. రెండు నిమిషాల వ్యవధిలో ఏడుగురు మృతి చెందగా.. దాదాపు 12 మందికి పైగా గాయపడినట్లు జిల్లా మెజిస్ట్రేట్ పేర్కొన్నారు. బాధితులను వెంటనే చికిత్స నిమిత్తం సదర్ ఆస్పత్రికి తరలించినట్లు వెల్లడించారు. మృతులు, గాయపడిన వారి వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

## భోగాపురం ఎయిర్‌పోర్టుకు తొలి విమానం రాక

**అమరావతి,ఆగస్టు17(:** భోగాపురం అల్లూరి సీతారామరాజు ఎయిర్‌పోర్టులో విమాన సర్వీసులు ప్రారంభం కావడంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందించారు. చరిత్రాత్మక ఘట్టానికి భోగాపురం వేదికైందన్నారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో నేటి నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. హైదరాబాద్ నుంచి తొలి ఇండిగో విమానం భోగాపురం విమానాశ్రయానికి చేరుకుందన్నారు. తొలి విమానం రాకతో ఏపీ.. కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఉత్తరాంధ్రకు మెరుగైన విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం.. రాష్ట్రంలో కొత్త అవకాశాలకు బాటలు వేస్తోందని సీఎం చెప్పుకొచ్చారు. యువత ఆశలు, ఆకాంక్షలకు ఈ విమానాశ్రయం రెక్కలు తొడుగుతుందని.. విద్య, ఉద్యోగాలు, వ్యాపార అవకాశాలకు మరింత ఊతమిస్తుందన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్‌పోర్టు కీలకంగా మారనుందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు చరిత్రాత్మక కొత్త ఆరంభమని.. ఉత్తరాంధ్రకు కొత్త గేట్‌వేగా అవతరించనుందని తెలిపారు. అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభంతో ఏపీ కొత్త శకానికి నాంది పలికిందని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

## 50 ఏళ్లలో గ్రూప్-1 లాంటి స్కామ్ చూడలే

**అమరావతి,ఆగస్టు17:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాంలో జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్ -1 అక్రమాలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సీరియస్ అయ్యారు. తన రాజకీయ జీవితంలో ఇంతటి తప్పిదాన్ని చూడలేదన్నారు. సోమవారం ఏపీ అసెంబ్లీ లాబీల్లో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో సీఎం చిట్‌చాట్ చేశారు. తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో గ్రూప్ -1 లాంటి స్కాం చూడలేదని వ్యాఖ్యానించారు. ఆ కుంభకోణంలో ఎంతోమంది మెరిట్ విద్యార్థులు బలి అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అసెంబ్లీలో చర్చిస్తామని అన్నారు. బుధవారం సభలో అన్ని విషయాలు చర్చిస్తామని చెప్పారు. డీఎస్సీలో మహిళా టీచర్లు ఎక్కువమంది ఉన్నారని ప్రస్తావించారు. ఆత్మాభిమానంతోనే ఆత్మగౌరవం కాపాడుకునేందుకు అంతమంది టీచర్లు వచ్చారని అన్నారు. వారి ఆత్మగౌరవాన్ని వైసీపీ నేతలు దెబ్బతీస్తోందంటూ సహించలేక రోడ్డెక్కారని చెప్పారు. మహిళా టీచర్లకు డీఎస్సీతో, ఓ ఎమోషనల్ బాండింగ్ ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## యనమదురు డ్రెయిన్ సామర్థ్యం పెంపు

**అమరావతి,ఆగస్టు17(:** ఏపీ అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలతో సభా సమావేశాలు ప్రారంభం అయ్యింది. యనమదురు డ్రెయిన్ ఆధునీకరణ, కేశవపల్లి కెనాల్ ప్రాజెక్టు స్థితిపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానం ఇచ్చారు. గోదావరి పశ్చిమ డెల్టాలో యనమదురు డ్రెయిన్ ముఖ్యమైనదన్నారు. 23వేల క్యూసెక్కుల సామర్థ్యం ఉన్న యనమదురు డ్రెయిన్‌కు, సామర్థ్యానికి మించి వరద వస్తోందని తెలిపారు. యనమదురు డ్రెయిన్ సామర్థ్యాన్ని 30వేల క్యూసెక్కులకు పెంచడం, శిథిలావస్థకు చేరిన ఇన్‌లెట్లను పునర్నిర్మాణం చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. యనమదురు డ్రెయిన్‌లో 86 ఇన్‌లెట్లకు గాను 70 ఇన్‌లెట్లు శిథిలావస్థకు చేరుకున్నాయని మంత్రి వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండు విడతల్లో రూ.3.2 కోట్లు కేటాయించి,10 ఇన్‌లెట్లను పునర్నిర్మిస్తున్నామన్నారు. యనమదురు డ్రెయిన్ ఉప్పుటేరు ద్వారా సముద్రంలో కలుస్తున్నందున, ఉప్పుటేరును కూడా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. గోదావరి డెల్టాలోని కాలువలు, డ్రెయిన్‌ల ఆధునీకరణ కోసం రూ.14 కోట్లు కేటాయించి లైడార్ సర్వే పూర్తి చేసి, డీపీఆర్ తయారు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 36 ప్రాధాన్య ప్రాజెక్టులతో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇరిగేషన్ క్యాలెండర్‌ను విడుదల చేశారన్నారు. 6 ప్రాధాన్య ప్రాజెక్టుల్లో గోదావరి డెల్టా ఆధునీకరణను కూడా చేర్చినట్లు నిమ్మల తెలిపారు. 2029 లోపు గోదావరి డెల్టా ఆధునీకరణ పనులు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 2019-24 పాలనలో ఓఅండ్‌ఎం నిధులు కేటాయించకపోవడంతో పాటు.. డీసిల్టింగ్, లాకులు, షట్టర్లు, రోప్స్ రిపేర్ల వైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో రెండేళ్లలోనే రూ.1100 కోట్లకు పైగా నిధులు కేటాయించి ఓఅండ్‌ఎం పనులను చేపట్టామన్నారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గంలో 2686 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు కేసనపల్లి కెనాల్ ప్రాజెక్టుకు అంచనాలు తయారు చేస్తున్నామన్నారు. కొబ్బరి పంట ఆధారిత గ్రామాల్లోకి సముద్రపునీరు చొచ్చుకు వస్తోందని, ప్రత్యామ్నాయంగా ఆయా గ్రామాలకు మంచినీరు అందించాలనే ఉద్దేశంతో రూ.50 కోట్లతో కేసనపల్లి కెనాల్ ప్రాజెక్టును ప్రతిపాదించామని అన్నారు. 2017-18 గత టీడీపీ పాలనలో జరిగిన డ్రెడ్జింగ్ పనులు మినహా, గత 5 ఏళ్ల వైసీపీ పాలనలో ఒక్క రూపాయి పని కూడా జరుగలేదని తెలిపారు.


## తిరుమలలో వరుణయాగ నిర్వహణకు నిర్ణయం

**తిరుమల,ఆగస్టు17(:** రాష్ట్రం, దేశం సుభిక్షంగా ఉండాలని, సకాలంలో వర్షాలు కురవాలని శ్రీవారిని ప్రార్థిస్తూ ఆగస్టు 30 నుంచి సెప్టెంబర్ 3వ తేదీ వరకు కారీరిష్టి యాగం (వరుణ యాగం), వరుణజపం, పర్జన్యశాంతి (ఇంద్ర యాగం) హోమాలను టీటీడీ నిర్వహించనుంది. తిరుమల ధర్మగిరి వేద విజ్ఞాన పీఠంలో ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 32 మంది వేద, శ్రౌత, స్మార్థపండితులు యాగ కార్యక్రమాల్లో పాల్గొంటారు. సెప్టెంబర్ 3న మహాపూర్ణాహుతి నిర్వహిస్తారు.

# డీఎస్సీ నియామకాల్లో డీవియేషన్ లేదు

మొదటి పేజీ తరువాయి

**అమరావతి, ఆగస్టు 17 :** మెగా డీఎస్సీ నియామకాల్లో ఎక్కడా డీవియేషన్ లేదని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నియామక ప్రక్రియకు సంబంధించిన వివరాలన్నీ పారదర్శకంగా ఆన్ లైన్‌లోనే ఉంచామన్నారు. వైసీపీ నేతలు హిట్ అండ్ రన్ చర్యలతో దీనిపై దుష్ప్రచారం చేస్తున్నారని సీఎం ఆక్షేపించారు. డీఎస్సీ నియామకాల అంశంపై శాసనసభలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "మంచి విద్య, నైపుణ్యాలు అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా విద్యార్థులు తయారవుతారని మేం విశ్వసించాం. దానికి అనుగుణంగానే చర్యలు తీసుకున్నాం. ఐటీని ప్రోత్సహించటం ద్వారా టెక్నాలజీలో ప్రపంచంలోనే అత్యుత్తమ మానవ వనరుల్ని తయారు చేశాం. విద్య రంగాన్ని తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ ప్రోత్సహించింది. రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా నాడు ఎన్టీఆర్ సంస్కరణలు తెచ్చారు. మహిళలకు ఉన్నత విద్యావకాశాలు కల్పించేందుకు మహిళా యూనివర్సిటీ ఏర్పాటు చేసింది మొదట ఎన్టీఆరే. నేను సీఎం అయిన తొలినాళ్లలోనే ఉమ్మడి రాష్ట్రంలో పాఠశాల లేకపోవటంపై తక్షణ చర్యలు తీసుకున్నాం. ప్రతీ కిలోమీటరుకు ఓ ప్రాథమిక పాఠశాల, ప్రతీ మండలానికి ఓ జూనియర్ కాలేజి, ఇంజనీరింగ్ కాలేజీ, జిల్లాకు మెడికల్ కాలేజిని ఏర్పాటు చేశాం. విద్యా ప్రమాణాలు పెంచితేనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. ఉపాధ్యాయుల నియామకాలు చేయని 2019-24 మధ్య ఉన్న పాలకులు విద్యారంగంపై డబ్బాలు కొట్టుకున్నారు. ఇప్పటి వరకూ 14 డీఎస్సీలు జరిగితే, టీడీపీ, ఎన్డీయే హయాంలో 11 డీఎస్సీల ద్వారా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాం. ఇంత వరకూ అవినీతి జరిగిందని ఒక్కరు కూడా ఫిర్యాదు చేయలేదు. పాఠశాలలకు విద్యార్థుల హాజరు పెంచాలనే లక్ష్యంతో గతంలో డ్రై రేషన్ కూడా అందించాం. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా రాష్ట్రంలో నాడు టీడీపీనే ప్రవేశపెట్టింది. ఇంటర్ విద్య వరకూ ఈ పథకాన్ని విస్తరించాం. మహిళలకు విద్యలో కూడా రిజర్వేషన్ కల్పించేలా నిర్ణయం తీసుకున్నాం. ఉపాధ్యాయుల బదిలీని పారదర్శకంగా చేసేందుకు ప్రత్యేకంగా ఓ చట్టమే తీసుకువచ్చాం. గడచిన 30 ఏళ్లుగా విద్యారంగంలో



వినూత్న సంస్కరణల ద్వారా మార్పులు తెచ్చాం. ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఐఐటీ, ఐఐఎం లాంటి విద్యా సంస్థలు సహా పోటీ పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం. 2019-24 మధ్య 10-12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్లకు రావటం మానేశారు. అందుకే తల్లికి వందనం పేరిట పిల్లలందరికీ ఆర్థికసాయం అందించేలా మేం నిర్ణయం తీసుకుని అమలు చేశాం. రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు పెంచటంతో 1 లక్ష మందికి పైగా విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల నుంచి ప్రభుత్వ స్కూళ్లకు వచ్చారు. "అని ముఖ్యమంత్రి అన్నారు.

### డీఎస్సీ నియామక ప్రక్రియ అంతా ఆన్‌లైన్‌లోనే

"గత పాలకులు 5 ఏళ్ల పాటు ఒక్క టీచర్ నియామకాన్ని కూడా చేపట్టలేదు. మేం అధికారంలోకి వస్తూనే తొలి సంతకం చేసి మెగా డీఎస్సీతో 15,941 ఉద్యోగాలను భర్తీ చేశాం. కేవలం 148 రోజుల్లోనే ప్రక్రియ అంతా పారదర్శకంగా పూర్తి చేసి నియామకాలు పూర్తి చేశాం. టెట్, డీఎస్సీ నోటిఫికేషన్లు సహా హారిజాంటల్, వర్టికల్ రిజర్వేషన్ల ప్రక్రియను కట్టుదిట్టంగా చేపట్టాం. 13 సబ్జెక్టుల్లో 42 వేల ప్రశ్నల్ని ఎంపిక చేసి అత్యుత్తమ విధానంలో పరీక్ష నిర్వహించాం. 154 సెంటర్లలో పరీక్షలు సీబీటీ విధానంలో చేపట్టి ఫలితాలను కూడా పారదర్శకంగా విడుదల చేశాం. పూర్తి ప్రతిభ ప్రకారం 15,941 మందిని ఎంపిక చేసి నియామకాలు చేశాం. జోనల్, రాష్ట్రస్థాయి కమిటీతో పాటు అప్పీలేట్ అథారిటీనీ కూడా పెట్టి ఫిర్యాదులను పరిష్కరించాం. స్పోర్ట్స్ కోటా కింద కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నిబంధనల్నే అమలు చేశాం. ఉద్యోగాలు వచ్చిన వారంతా అత్యుత్తమ ప్రతిభ కలిగిన వ్యక్తులు, ఎంతో కష్టపడి ఉద్యోగం సంపాదించుకున్నారు. మెగా డీఎస్సీ ద్వారా తమ కష్టానికి ఫలితం దక్కిందని టీచర్లు చెప్పారు. మెరిట్ కమ్ రోస్టర్ విధానంలోనే రిజల్ట్స్ ఇచ్చాం. ఎంపిక ప్రక్రియ అంతా ఆన్ లైన్‌లోనే ఉంది. ఇంతకంటే పారదర్శకత ఎక్కడ ఉంటుంది.? ప్రభుత్వంలో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన ఓ ఐఎఎస్ అధికారి, ఓ మాజీ మంత్రి ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. నోటిఫికేషన్‌లో నియామక ప్రక్రియలో ఒక్క డీవియేషన్ కూడా లేదు. లిటిగెంట్ పార్టీకి చెందిన వ్యక్తులు వందల కేసులు వేసి అడ్డంకులు సృష్టించారు. అధికారికంగా వివరణ ఇచ్చినా రోజుకో కుట్ర చేస్తూనే ఉన్నారు. డీఎస్సీపై గొడ్డలిపార్టీ ఒడిశా కూలీలతో ,90 ఏళ్ల జగన్ జెన్ జీ వ్యక్తులతో ధర్నాలు చేయించింది. ఈ ఆరోపణల్ని ఇక సహించలేక ఇప్పుడు టీచర్లే రోడ్డుపైకి వచ్చారు. మొన్న కర్నూలులో, నిన్న విజయవాడలో పెద్ద ఎత్తున టీచర్లు ఆందోళన చేశారు. పిల్లలకు పాఠాలు చెబుతాం, ప్రతిభను కించ పరిస్తే గుణపాఠం కూడా చెబుతామని వారు నినదించారు"అని ముఖ్యమంత్రి అన్నారు.

### అసెంబ్లీకి రాకుండా పబ్జీలు"

మా ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ, కుట్రలు చేసే పార్టీలకు, వ్యక్తులకు కాదు. ధైర్యం ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని సవాల్ విసురుతున్నాను. అసెంబ్లీకి వస్తే అడ్డంగా దొరికిపోతారనే వాళ్లు రావటం లేదు. రోడ్డుపై హిట్ అండ్ రన్ తరహాలో వ్యవహరిస్తున్నారు. రాష్ట్రంలో ఏ కుట్రలూ పనిచేయవని డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన వారికి చెబుతున్నాను. పూర్తి పారదర్శకతతో బాధ్యతతో, పూర్తి జవాబు దారీతనంతో నియామకాలు జరిగాయి. విద్యావిధానంలో సంస్కరణలతో పాటు పరీక్షల్లోనూ మరింత పారదర్శకత తీసుకువస్తాం. సిగ్గులేని ఆ పార్టీ అసెంబ్లీకి రాకుండా బయట పబ్జీలు ఆడుకుంటున్నారు. బాధ్యత కలిగిన వ్యక్తులు శాసనసభకు వచ్చి డిమాండ్ చేయాలి. రెండున్నర ఏళ్ల నుంచి అసెంబ్లీకి రాని పార్టీని చూడటం నా జీవితంలో ఇదే తొలిసారి. అసెంబ్లీకి రాకుండానే జీతాలు, ప్రివిలేజెస్ తీసుకుంటున్నారు. అనే నేనుగా నాకు ప్రజలపై పూర్తి బాధ్యత ఉంది. వారికి ఏముందో ప్రజలే చెప్పాలి."అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు

## రూ.500 కోట్లతో ఎంజేపీలకు శాశ్వత భవనాలు

**అమరావతి, ఆగస్టు 17 :** రూ.500 కోట్ల సాస్కి నిధులతో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మించాలని నిర్ణయించామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. బీసీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, మరమ్మతులకు నిధులు కేటాయించామని తెలిపారు. వర్షా కాల అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మొదటిరోజు సోమవారం శాసనసభలో ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సవిత సమాధానాలిచ్చారు. నాణ్యమైన విద్యను అందిస్తున్న బీసీ గురుకులాలకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. రూ.500 కోట్ల సాస్కి నిధులతో ఎంజేపీ బీసీ గురుకులాల భవనాలు నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఈ ఏడాది కొత్తగా 10 బీసీ గురుకులాలు స్థాపించామని, వాటిలో 5 రాయలసీమలో, మరో 5 ఉత్తరాంధ్రలో నెలకొల్పామని తెలిపారు. ఆరు బీసీ బాలికల గురుకులాలను జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. బీసీ బాలికల డ్రాపౌట్ల నివారణకు జూనియర్ కళాశాలలుగా అప్ గ్రేడ్ చేశామన్నారు. 50 మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్న బీసీ హాస్టళ్లను గురుకులాల్లో విలీనం చేస్తున్నామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తరవాత ఏపీలో 32 బీసీ గురుకులాలు మాత్రం ఉన్నాయని, 2014-19 మధ్య 75 బీసీ గురుకులాలను సీఎం చంద్రబాబు ఏర్పాటు చేశారని మంత్రి సవిత గుర్తు చేశారు. వాటిలో 25 ఎంజేపీలకు శాశ్వత భవనాల కోసం రూ.40 కోట్లను ఆనాడు మంజూరుచేయగా, 70 నుంచి 80 శాతం మేర పనులు సైతం పూర్తయ్యాయని అన్నారు. తరవాత వచ్చిన ప్రభుత్వం బీసీ గురుకులాలను పట్టించుకోకుండా గాలి కొదిలేసిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసంపూర్తి గా నిలిచిపోయిన భవనాలకు నిధులు మంజూరు చేసిందన్నారు.గోనబావి, మడకశిర, రొద్దం, పులివెందుల సహా పలు ప్రాంతాల్లో ఉన్న గురుకులాల పనులు పున:ప్రారంభించామని, త్వరలోనే వాటిని పూర్తి చేసి బీసీ బిడ్డలకు అంకితం చేస్తామని తెలిపారు. బీసీ హాస్టళ్లలో 90,676 మంది విద్యార్థులు చదువుతున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే హాస్టళ్ల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని మంత్రి సవిత తెలిపారు. సీఎస్ఆర్, డిస్ట్రిక్ మినరల్ ఫండ్స్ ద్వారా హాస్టళ్ల మరమ్మతులు చేపట్టామన్నారు. పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్న హాస్టళ్లను వేరే భవనాల్లోకి షిఫ్ట్ చేశామన్నారు. మరికొన్నింటిని గుర్తించామని, వాటిని కూడా త్వరలో షిఫ్ట్ చేస్తామని తెలిపారు. హాస్టళ్లలో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్య ఇస్తున్నామని, సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు, ఇనర్వర్టర్లు, దోమ తెరలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎఫ్ఆర్ఎస్ విధానం ప్రవేశపెట్టి వార్డెన్లు, విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగు పరిచామన్నారు. హాస్టళ్లలో పారిశుధ్య నిర్వహణకు 1,291 మంది పారిశుధ్య సిబ్బందిని, 142 మంది కుక్, కమాటీలను నియమించామని తెలిపారు. 2026-27 బడ్జెట్ లో హాస్టళ్ల మరమ్మతులకు రూ.20 కోట్లు కేటాయించామన్నారు. 2019-24 మధ్య ఆనాటి ప్రభుత్వం హాస్టళ్ల కనీస మరమ్మతులకు, వసతులకు నిధులు కూడా కల్పించలేదని మంత్రి సవిత తెలిపారు. రూ,.9.75 కోట్లతో భీమిలి బీసీ గురుకుల పాఠశాలకు అదనపు భవనం నిర్మిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. ఈ భవనానికి సంబంధించి అంచనాలు కూడా ఇప్పటికే రూపొందించామని, అనుమతులు రాగానే నిర్మాణం ప్రారంభిస్తామన్నారు.

## ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు

**అమరావతి,ఆగస్ట్17(:** ఎల్‌నినో ప్రభావంతో ఎక్కడ చూసినా తీవ్ర వర్షాభావ పరిస్థితులున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈసారి ప్రాజెక్టులకు వచ్చే నీళ్లు కూడా తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పైనుంచి నీళ్లు రాకుంటే శ్రీశైలం, నాగార్జున సాగర్‌పై తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. ముందుజాగ్రత్త వహించి నీటిని పొదుపుగా వాడి పలు ప్రాజెక్టుల్లో నీరు నిల్వ చేసుకున్నామన్నారు. ప్రస్తుతం పెద్ద ప్రాజెక్టుల్లో 586 టీఎంసీల నీళ్లు ఉన్నాయని తెలిపారు.

గోదావరి డెల్టా తప్ప ఎక్కడ వరిపంట వేసినా ఇబ్బందులు వస్తాయి. నీళ్లు లేక పంటలు ఎండిపోయే పరిస్థితులు రావొచ్చు. నీటి విడుదలలో తాగునీటికి, పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. కర్నూలు జిల్లాలో ఈసారి ఉల్లి సాగు తగ్గవచ్చు. నీటిని తక్కువగా తీసుకునే పంటలను ప్రోత్సహిస్తున్నాం. ఎమ్మెల్యేలు, మంత్రులు వారి ప్రాంతాల్లో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలి. రైతుల నుంచి వచ్చే పంటలబీమా దరఖాస్తులు పెరిగాయి. పంటలబీమాలో దేశంలోనే ఐదో స్థానంలో ఉండటం మనకు గర్వకారణం'అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సాధారణ వర్షపాతం కంటే తీవ్రమైన లోటు కనిపిస్తోందని చెప్పారు. సోమవారం అసెంబ్లీలో ఎల్‌నినోపై చర్చ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. అసెంబ్లీ వేదికగా ఎల్‌నినో విషయమై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కావేరి జలాల విషయంలో తమిళనాడు-కర్ణాటక మధ్య జరుగుతున్న వివాదంలో సుప్రీం కూడా జోక్యం చేసుకుందని తెలిపారు.

## అత్యంత పారదర్శకంగా డిఎస్సీ నిర్వహణ

**అమరావతి,ఆగస్ట్17(:** డీఎస్సీ నిర్వహణ అత్యతం పారదర్శకంగా, పటిష్టంగా నిర్వహించామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. డిఎస్సీ అంటే తెలియని వారు, ఐదేళ్లు అధికారంలో ఉండగా నిర్వహించని వారు డిఎస్సీపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. మెగా డీఎస్సీ-2025పై అసెంబ్లీలో మంత్రి లోకేశ్ మాట్లాడారు. డీఎస్సీని చాలా బాధ్యతగా తీసుకుని నిర్వహించామని పేర్కొన్నారు.'ఏటా డీఎస్సీని నిర్వహిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చాం. మొత్తం 148 రోజుల్లోనే డీఎస్సీ నియామకాలు పూర్తి చేశాం. విద్యా వ్యవస్థలో తెదేపా ప్రభుత్వం ఎన్నో సంస్కరణలు అమలు చేసింది. టీచర్ల నియామకాలు, బదిలీలు పారదర్శకంగా ఉండాలని సీఎం భావించారు. మా ప్రభుత్వం టీచర్లను సింగపూర్, ఫిన్‌లాండ్‌లకు పంపింది. గతంలో వైకాపా ప్రభుత్వం టీచర్లను మద్యం దుకాణాల ముందు నిలబెట్టింది' అని మంత్రి లోకేశ్ అన్నారు. మంత్రి లోకేశ్.. మాట్లాడుతూ ఇక నుంచి ఏటా డీఎస్సీ నిర్వహిస్తామన్నారు. డీఎస్సీ నియామకాలపై ప్రతిపక్ష పార్టీకి తాను సమాధానం ఇవ్వడం లేదన్న మంత్రి.. డీఎస్సీని ఎలా నిర్వహించాం, ఎలాంటి నిబంధనలు పాటించి నియామకాలు చేపట్టామో రాష్ట్ర ప్రజలకు చెప్పాల్సి ఉందన్నారు. అందుకే.. మెగా డీఎస్సీపై ఉన్న నిజాలు తెలియజేస్తూ ఆ సమాచారాన్ని సభ్యులకు పుస్తక రూపంలో పంపామని మంత్రి లోకేశ్ తెలిపారు.'కూటమి ప్రభుత్వం డీఎస్సీని బాధ్యతగా భావించింది. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించాం. ఈ పోస్టులకు 3,36,300 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. 148 రోజుల్లోనే డీఎస్సీ ఉద్యోగాల భర్తీ పక్రియ పూర్తిచేశాం. . కూటమి ప్రభుత్వం.. టీచర్లను ట్రైనింగ్ కోసం సింగపూర్, ఫిన్లాండ్ పంపితే.. వైసీపీ హయంలో మద్యం షాపుల ముందు కాపలా పెట్టారు.' అని గత ప్రభుత్వ విధానాలను మంత్రి లోకేశ్ ఎండగట్టారు. 'డీఎస్సీ కోసం 42వేల ప్రశ్నలు తయారు చేశాం. డీఎస్సీకి ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు ఇచ్చాం. నియామకాలపై అనేక స్థాయిల్లో వచ్చిన గ్రీవెన్స్‌ను పరిష్కరించాం. భిన్నాభిప్రాయాలతో 336 కేసులు నమోదు చేశారు. డీఎస్సీ పరీక్షను టీసీఎస్ ఐయాన్ ఎ÷-లాట్ ఫాం ద్వారా నిర్వహించాం. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను డిస్ట్రిక్ట్ యూనిట్‌గా చేశాం. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లతో నియామకాలు చేపట్టాం. టీచర్ క్వాలిఫికేషన్‌లో టెట్ మ్యాండేటరీ చేశాం. టీసీఎస్ ఐయాన్ ద్వారా నోటిఫికేషన్‌ను పారదర్శకంగా నిర్వహించాం. ఎస్సీ వర్గీకరణ పూర్తిచేసి, ఉపకులాలను గ్రూప్‌లో సెట్ చేసిన తరువాతే డీఎస్సీ నిర్వహించాం. గతంలో 29 స్పోర్ట్స్ కేటగిరీలు ఉంటే.. 65 స్పోర్ట్స్ కేటగిరీలకు పెంచాం. కేంద్ర ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే స్పోర్ట్స్ కోటా పెంచాం.' అని మంత్రి లోకేశ్ క్లారిటీ ఇచ్చారు. 'కొందరికి డీఎస్సీ అంటే అర్థం కూడా తెలియదు. వాళ్లే పేపర్ లీక్ అని మాట్లాడుతున్నారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ పక్కాగా జరిగాకే ఉద్యోగాలిచ్చాం. ఏడాది తర్వాత డీఎస్సీలో అక్రమాలంటూ వైసీపీ ఆరోపిస్తోంది. మీ ఆరోపణలకు ఆధారాలు చూపండి. డీఎస్సీపై టీమ్ 11వి అనవసర ఆరోపణలు' అంటూ మంత్రి లోకేశ్ కొట్టిపారేశారు. ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు స్వేచ్ఛ ఉంది. వ్యవస్థను ఎవరైనా ప్రశ్నించవచ్చు. భిన్నాభిప్రాయాలు ఉన్నవారు కోర్టుల్లో 336 కేసులు దాఖలు చేశారు. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్ అమలు చేయాలని కోర్టు స్పష్టంగా చెప్పింది. డీఎస్సీలో ఇలాంటి రిజర్వేషన్ అమలు దేశ చరిత్రలోనే తొలిసారి. పారదర్శకంగా మేం నియామకాలు చేపట్టాం. అందుకే వేల మంది ఉపాధ్యాయులు స్వచ్ఛందగా బయటకు వచ్చి ప్రభుత్వానికి అండగా నిలిచారు ' అని లోకేశ్ అన్నారు. డీఎస్సీపై జగన్ టీమ్ 11 అనవసర ఆరోపణలు చేస్తోంది. కులం, మతం పేరుతో వైకాపా రాష్ట్రంలో చిచ్చు పెడుతోంది. గొడ్డలి పార్టీ అధ్యక్షుడు సభకు రాలేదు. జగన్ అనే వ్యక్తి అంబేడ్కర్ రాజ్యాంగాన్నే ప్రశ్నిస్తున్నారు. అంబేడ్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లు తీసుకువచ్చారు. వర్టికల్, హారిజంటల్ రిజర్వేషన్లను పారదర్శకంగా నిర్వహించాలనే లక్ష్యంతో ఉన్నాం. ప్రెస్‌మీట్లు ఎందుకు.. జగన్ సభకు ఎందుకు రాలేదు. తేదీ, సమయం ఖరారు చేయండి.. చర్చకు నేను సిద్ధం. సభలోపలనైనా.. వెలుపలనైనా.. ఎక్కడైనా నేను సిద్ధం. నేనేమీ పారిపోవట్లేదు.. మీలాగా నాపై సీబీఐ కేసులు లేవు.. బెయిల్‌పై లేను. సభకు వచ్చి చర్చించాలని సవాల్ విసురుతున్నా' అని లోకేశ్ అన్నారు.

## ఎపి అభివృద్ధి గమ్యానికి కొత్తరెక్కలు

**అమరావతి,ఆగస్ట్17** ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి గమ్యానికి కొత్త రెక్కలు తొడుగుతూ భోగాపురం అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయంలో విమానసేవలు ప్రారంభం కావడం ఎంతో ఆనందదాయకమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. హైదరాబాద్ నుంచి వచ్చిన ఇండిగో విమానం విజయవంతంగా ల్యాండ్ కావడంతో రాష్ట్ర ప్రగతి చరిత్రలో ఒక అద్భుత ఘట్టంగా ఆవిష్కృతమైందని తెలిపారు. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పేరుతో నిర్మితమైన ఈ అంతర్జాతీయ విమానాశ్రయం కేవలం రవాణా సౌకర్యాల విస్తరణ మాత్రమే కాదని, ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల ఆకాంక్షలకు నిలువెత్తు రూపమని చెప్పుకొచ్చారు.

# భారత్‌కు భారీ ఆధిక్యం!

**శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 284 పరుగులకు ఆలౌట్**

**సోనాల్ దినుషా సెంచరీ.. రాణించిన నిరోషన్ డిక్‌వెల్లా**

**నాలుగు వికెట్లతో అదరగొట్టిన బౌలర్ మానవ్ సుతార్**

**భారీగా వర్షం రావడంతో ముగిసిన మూడో రోజు ఆట..**




శ్రీలంకతో తొలి టెస్ట్‌లో భారత్‌కు భారీ ఆధిక్యం లభించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 79.4 ఓవర్లలో 284 పరుగులకు కుప్పకూలింది. సోనాల్ దినుషా(100) సెంచరీతో చెలరేగగా.. నిరోషన్ డిక్‌వెల్లా(115 బంతుల్లో 7 ఫోర్లతో 80) హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(4/76) నాలుగు వికెట్లు తీయగా.. రవీంద్ర జడేజా(3/57) మూడు వికెట్లు పడగొట్టాడు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ తీసారు. అంతకుముందు 460/9 ఓవర్‌నైట్ స్కోర్‌తో మూడో రోజు ఆటను కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులకు కుప్పకూలింది. దేవదత్ పడిక్కల్(230 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 167) సెంచరీతో రాణించగా.. కేఎల్ రాహుల్(175 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 82) శతకాన్ని చేజార్చుకున్నాడు. ధ్రువ్ జురెల్(68 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య(4/109) నాలుగు వికెట్లు తీయగా.. కేశర నువాంత(3/175) మూడు వికెట్లు పడగొట్టాడు. అసితా ఫెర్నాండో(2/63) రెండు వికెట్లు తీసాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకకు భారత బౌలర్లు షాకిచ్చారు. సిరాజ్, జడేజా, మానవ్ సుతార్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 90 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. దాంతో శ్రీలంక 99/5 స్కోర్‌తో లంచ్ బ్రేక్‌కు వెళ్లింది. తొలి సెషన్‌లో భారత్ పూర్తి ఆధిపత్యం చెలాయించింది. రెండో సెషన్‌లో సొనాల్ దినుషా, నిరోషణ్ డిక్‌వెల్లా శ్రీలంకను ఆదుకున్నారు. అద్వితీయమైన బ్యాటింగ్ ప్రదర్శనతో భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగారు. ఈ క్రమంలో నిరోషన్ డిక్‌వెల్లా 67 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించగా.. దినుషా 92 బంతుల్లో అర్ధశతకాన్ని అందుకున్నాడు. దాంతో శ్రీలంక 215/5 స్కోర్ టీ బ్రేక్‌కు వెళ్లింది. దినుషా, డిక్‌వెల్ల అద్భుత బ్యాటింగ్‌తో రెండో సెషన్‌లో శ్రీలంకనే పైచేయి సాధించింది.ఆఖరి సెషన్‌లో భారత బౌలర్లు జూలు విధిల్చారు. 146 పరుగుల భాగస్వామ్యంతో క్రీజులో పాతుకుపోయిన ఈ జోడీని ప్రసిధ్ కృష్ణ విడదీసాడు. సెంచరీ దిశగా సాగిన నిరోషన్ డిక్‌వెల్లా(80)ను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. ఈ వికెట్‌తో మ్యాచ్ భారత్‌వైపు మలుపు తిరిగింది. ఆ వెంటనే కేశర నువాంత(2)ను జడేజా ఔట్ చేయగా.. ప్రభాత్ జయసూర్య(10)ను మానవ్ సుతార్ వెనక్కిపంపాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా మరోవైపు సోనాల్ దినూషా.. 167 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఆ మరుసటి బంతికే అతన్ని జడేజా ఎల్బీగా పెవిలియన్ మార్చాడు. లాహిరు కుమార(10)ను మానవ్ సుతార్ ఔట్ చేయడంతో శ్రీలంక ఇన్నింగ్స్‌కు తెరపడింది. ఆ వెంటనే వర్షం రావడంతో అంపైర్లు మూడో రోజు ఆటను ముగించారు. నాలుగో రోజు ఆటలో భారత్ తొలి సెషన్‌లోనే 130 పరుగులు చేసి శ్రీలంక ముందు 300 ప్లస్ రన్స్ లక్ష్యాన్ని నమోదు చేయాలి. అప్పుడే ఈ మ్యాచ్ భారత్ వశమవుతోంది. వర్షం అంతరాయం కలిగిస్తున్న నేపథ్యంలో చాలా తెలివిగా ఆడాల్సిన అవసరం ఉంది.




## చరిత్ర సృష్టించిన రవీంద్ర జడేజా..

టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చరిత్ర సృష్టించాడు.టెస్ట్ క్రికెట్‌లో 350 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. తద్వారా టెస్ట్‌ల్లో 350 వికెట్లతో పాటు 4000కిపైగా పరుగులు చేసిన రెండో భారత ఆల్‌రౌండర్‌గా నిలిచాడు. శ్రీలంకతో గాలే వేదికగా జరిగిన తొలి టెస్ట్‌లో రవీంద్ర జడేజా ఈ ఫీట్ సాధించాడు. శ్రీలంక కెప్టెన్ ధనంజయ డిసిల్వా,కేశర నువంతలను ఔట్ చేయడం ద్వారా ఈ ఘనతను అందుకున్నాడు. ఓవరాల్‌గా టెస్ట్‌ల్లో 350 వికెట్లు తీసిన ఐదో బౌలర్‌గా జడేజా నిలిచాడు. అతనికి ముందు అనిల్ కుంబ్లే(619), రవిచంద్రన్ అశ్విన్(537), కపిల్ దేవ్(434), హర్భజన్ సింగ్(417) మాత్రమే 350 వికెట్ల మైలురాయి అందుకున్నాడు. టెస్ట్ క్రికెట్‌లో ఇప్పటి వరకు జడేజా 4,095 పరుగులు చేశాడు. 350 వికెట్లతో పాటు 4000 ప్లస్ రన్స్ చేసిన నాలుగో ఆల్‌రౌండర్‌గా జడేజా నిలిచాడు. కపిల్ దేవ్, ఇయాన్ బోథమ్(ఇంగ్లండ్), డేనియల్ వెటోరి(న్యూజిలాండ్) మాత్రమే జడేజా కంటే ముందు ఈ ఫీట్ సాధించాడు. అంతేకాకుండా టెస్ట్‌ల్లో అత్యధిక వికెట్లు తీసిన లెఫ్టార్మ్ స్పిన్నర్లలో జడేజా మూడో స్థానంలో నిలిచాడు. రంగన హెరత్(శ్రీలంక) 433 వికెట్లతో అగ్రస్థానంలో ఉండగా.. డేనియల్ వెటోరి(న్యూజిలాండ్) 362 వికెట్లు, రవీంద్ర జడేజా(భారత్) 350 వికెట్లు, డెరెక్ అండర్ వుడ్(ఇంగ్లండ్) 297 వికెట్లు, తైజుల్ ఇస్లామ్(బంగ్లాదేశ్) 271 వికెట్లు ఈ జాబితాలో ఉన్నారు. టెస్ట్‌ల్లో కనీసం 125 వికెట్లు తీసిన లెఫ్టార్మ్ స్పిన్నర్లలో సౌతాఫ్రికాకు చెందిన కేశవ్ మహారాజ్(56.4) తర్వాత జడేజా(58.1) రెండో అత్యుత్తమ స్ట్రైక్‌రేట్‌ను కలిగి ఉండటం మరో విశేషం. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 462 పరుగులకు ఆలౌటైంది. దేవదత్ పడిక్కల్(230 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 167) సెంచరీతో రాణించగా.. కేఎల్ రాహుల్(175 బంతుల్లో 10 ఫోర్లు, సిక్స్‌తో 82) శతకాన్ని చేజార్చుకున్నాడు. ధ్రువ్ జురెల్(68 బంతుల్లో 4 ఫోర్లు, సిక్స్‌తో 51) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. శ్రీలంక బౌలర్లలో ప్రభాత్ జయసూర్య(4/109) నాలుగు వికెట్లు తీయగా.. కేశర నువాంత(3/175) మూడు వికెట్లు పడగొట్టాడు. అసితా ఫెర్నాండో(2/63) రెండు వికెట్లు తీసాడు.అనంతరం శ్రీలంక తొలి ఇన్నింగ్స్‌లో 79.4 ఓవర్లలో 284 పరుగులకు ఆలౌటైంది. సోనాల్ దినుషా(100) సెంచరీతో చెలరేగగా.. నిరోషన్ డిక్‌వెల్లా(115 బంతుల్లో 7 ఫోర్లతో 80) హాఫ్ సెంచరీతో రాణించాడు. భారత బౌలర్లలో మానవ్ సుతార్(4/76) నాలుగు వికెట్లు తీయగా.. రవీంద్ర జడేజా(3/57) మూడు వికెట్లు పడగొట్టాడు. సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, కుల్దీప్ యాదవ్ తలో వికెట్ తీసారు. దాంతో భారత్‌కు 178 పరుగుల భారీ ఆధిక్యం లభించింది.

## రుతురాజ్ గైక్వాడ్ చెత్త కెప్టెన్..

**అతని కెప్టెన్సీలో సీఎస్‌కే ప్లే ఆఫ్స్ కూడా చేరదు**

**రుతురాజ్ పై సంజూ శాంసన్ తీవ్ర విమర్శలు!!**





చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ చెత్త కెప్టెన్ అని ఆ జట్టు స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్ అన్నట్లు ఓ ఫేక్ న్యూస్ నెట్టింట వైరల్ అవుతుంది. రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో సీఎస్‌కే ఫైనల్ కూడా చేరదని సంజూ అన్నట్లుగా ఉన్న ఈ పోస్ట్ నెట్టింట తీవ్ర చర్చనీయాంశమైంది. అయితే ఈ ఫేక్ పోస్ట్ అని భారత మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా అన్నాడు. ఏ ఇంటర్వ్యూలో కూడా సంజూ ఈ వ్యాఖ్యలు చేయలేదని తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడుతూ స్పష్టం చేశాడు. సీఎస్‌కే తరఫున ఏ బాధ్యతలైనా చేపట్టేందుకు సిద్దంగా ఉన్నానని సంజూ అన్నట్లుగా ఈ ఫేక్ పోస్ట్‌ను క్రియేట్ చేశారు. 'రుతురాజ్ విఫలమయ్యాడు.. సీఎస్‌కే సారథ్య బాధ్యతలు అందుకునేందుకు సిద్ధంగా ఉన్నారా? 'అని ఇంటర్వ్యూయర్ ప్రశ్నించగా.. 'అవును. సీఎస్‌కే తరఫున ఏ బాధ్యతలైనా చేపట్టేందుకు రెడీగా ఉన్నా. కెప్టెన్‌గా నాకు అనుభవం ఉంది. రుతురాజ్ సారథ్యంలో సీఎస్‌కే సాధించిందేం లేదు.అతనో చెత్త కెప్టెన్. వరల్డ్ బెస్ట్ ఎలెవన్ ఇచ్చినా అతను ఏం చేయలేడు. కనీసం సీఎస్‌కేను ప్లే ఆఫ్స్ కూడా చేర్చలేడు. సీఎస్‌కే నాకు కెప్టెన్సీ బాధ్యతలు ఇస్తే.. స్వీకరిస్తా. రుతురాజ్ ఏం చేయలేడు. అందుకే సీఎస్‌కే సారథ్య బాధ్యతలు చేపట్టాలనుకుంటున్నా.'అని సంజూ శాంసన్ అన్నట్లుగా ఫేక్ పోస్ట్ క్రియేట్ చేశారు. ఈ పోస్ట్‌పై స్పందించిన ఆకాశ్ చోప్రా.. ఫేక్ అని తేల్చేసాడు. అందరూ నమ్మదగిన రీతిలో రాసుకొచ్చారని పేర్కొన్నాడు. ఇలాంటి ఇంటర్వ్యూ జరగలేదని స్పష్టం చేశాడు. 'సీఎస్‌కే తరఫున ఎలాంటి బాధ్యతలైనా చెప్పట్టేందుకు సిద్దంగా ఉన్నానని సంజూ చెప్పాడు. ఇది సరైనదే. నమ్మదగిన రీతిలోనేఉంది. ఇంటర్వ్యూయర్ రుతురాజ్ విఫలమయ్యాడు. సీఎస్‌కే సారథ్య బాధ్యతలు చెపడుతారా? అని అడిగాడు. సంజూ.. అందుకు సిద్ధంగా ఉన్నానని, సీఎస్‌కే కోసం ఏమైనా చేస్తానని, రుతురాజ్ సారథ్యంలోనే సీఎస్‌కే సాధించిందేం లేదన్నాడు. రుతురాజ్ చెత్త కెప్టెన్. అతను జట్టును ప్లే ఆఫ్స్ కూడా చేర్చలేదని చెప్పాడు. జనాలు ఈ పోస్ట్ చదివితే నిజమేనని అంటారు. సీఎస్‌కే కెప్టెన్సీకి సంజూనే సరైనవాడని కూడా అంటారు. అతనికి ఒక్క అవకాశం ఇవ్వాలని కూడా సూచిస్తారు. అయితే కొందరు మాత్రం ఈ ఇంటర్వ్యూ లింక్ అడిగారు. అయితే ఈ ఇంటర్వ్యూ ఎక్కడా జరగలేదు. సంజూ శాంసన్ ఎక్కడా ఇలా చెప్పలేదు. ఇది ఫేక్ న్యూస్. అసలు ఈ తరహా ఇంటర్వ్యూనే జరగలేదు. సంజూ అనలేదు'అని ఆకాశ్ చోప్రా చెప్పుకొచ్చాడు. 2024 నుంచి సీఎస్‌కే ప్లే ఆఫ్స్ చేరలేదు.

## ఇంగ్లాండ్ చేతిలో భారత్‌కు ఓటమి

**హాకీ వరల్డ్‌కప్‌లో భారత్‌కు తొలి ఓటమి**

**ఉత్కంఠభరితంగా కొనసాగిన మ్యాచ్**

**19న పాకిస్థాన్‌తో భారత్ మూడో మ్యాచ్**




2026 హాకీ వరల్డ్‌కప్‌లో భారత్ పురుషుల జట్టుకు ఎదురుదెబ్బ తగిలింది. పూల్ డీలో భాగంగా సోమవారం ఇంగ్లాండ్?తో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్?లో భారత్ 4–2 తేడాతో ఓడిపోయింది. దీంతో రెండో రౌండ్‌కు భారత్? అర్హత సాధించాలంటే తదుపరి పాకిస్థాన్‌పై మ్యాచ్?లో తప్పక నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ వేల్స్?పై ఇంగ్లాండ్ గెలిస్తే, పాక్?తో మ్యాచ్?ను డ్రా చేసుకున్నా సరిపోతుంది. పూల్ స్టేజ్?లో భాగంగా ఆమ్‌స్టల్‌వీన్‌లోని వాగ్నర్ హాకీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ ? ఉత్కంఠభరితంగా సాగింది. తొలి క్వార్టర్‌లో ఇంగ్లాండ్ జట్టు ప్రారంభంలోనే ఒక గోల్ చేసి 1–0 ఆధిక్యాన్ని సాధించింది. అయితే, రెండో క్వార్టర్‌లో భారత్ అద్భుతంగా పుంజుకుంది. ఏకంగా రెండు గోల్స్ సాధించింది. హర్మన్‌ప్రీత్ సింగ్ పెనాల్టీ కార్నర్ ద్వారా ఒక గోల్ చేయగా, అదే క్వార్టర్‌లో దిల్ప్రీత్ సింగ్ మరో గోల్ చేసి భారత్‌కు 2–1 ఆధిక్యాన్ని అందించారు. అయితే మూడో క్వార్టర్‌లో ప్రత్యర్థి ఇంగ్లాండ్ జట్టు బలంగా పుంజుకుంది. ఆ జట్టు కొంతసేపటికే భారత్? స్కోరును సమం చేసింది. అంతేకాకుండా అదే దూకుడును ప్రదర్శించడంతో 3–2తో లీడ్?లోకి దూసుకెళ్లింది. నాలుగో క్వార్టర్‌లో భారత్‌కు కోలుకునే అవకాశం ఉన్నప్పటికీ, ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోయింది. అదే ఊపులో ఉన్న ఇంగ్లాండ్ ఇంకో గోల్ చేసి తమ ఆధిక్యాన్ని 4– 2కు పెంచుకుంది. ఇంగ్లాండ్ తరఫున స్టువర్ట్ రష్‌మెర్, హెన్రీ క్రాఫ్ట్, నికోలస్ బండూరక్ చివరి మూడు గోల్స్ సాధించారు. చివరి నిమిషాల్లో భారత్ పోరాట పటిమను ప్రదర్శించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో మ్యాచ్ 4– 2తో ముగిసింది. ఇక ఈ టోర్నీలో భారత్ తమ మూడో మ్యాచ్? పాకిస్థాన్?తో ఆడాల్సి ఉంది. ఈ మ్యాచ్ ఆగస్టు 19న ఉండనుంది. కాగా, ఈ మ్యాచ్ ఆరంభమైన తీరు చూస్తే భారత్ సరికొత్త చరిత్ర సృష్టించేలాగే కనిపించింది. ఎందుకంటే 1994 నుంచి ప్రపంచ కప్‌లో ఇంగ్లాండ్‌ను భారత్ ఓడించలేదు. ఈ మ్యాచ్?లో గెలుపు పక్కా అనుకున్నారంతా. కానీ అసలైన సమయంలో ఇంగ్లాండ్ పుంజుకోవడంతో టీమ్‌ఇండియాకు ఓటమి తప్పలేదు. అయితే పారిస్ ఒలింపిక్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో మాత్రం ఇంగ్లాండ్‌ను టీమ్‌ఇండియా ఓడించింది. ఇరుజట్లు కూడా తమ ప్రారంభ మ్యాచ్‌లలో విజయం సాధించి రెండో గేమ్?లో అడుగుపెట్టాయి. భారత్ తమ తొలి మ్యాచ్?లో వేల్స్‌ను 3–1తో ఓడించి (ఈ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ రెండు గోల్స్ చేశాడు) ప్రపంచ కప్?లో శుభారంభం చేసింది. మరోవైపు పాకిస్థాన్‌ను 4– 1 తేడాతో ఇంగ్లాండ్ ఓడించింది. దీంతో గ్రూప్ డీలో ఇంగ్లాండ్? టాప్?లో కొనసాగుతోంది. రెండు మ్యాచ్?లు ఆడగా, రెండింట్లోనూ విజయం సాధించిన ఆ జట్టు 6 పాయింట్లతో టాప్?లో ఉంది. రెండింట ఒకదాంట్లో నెగ్గిన భారత్ (3 పాయింట్లు) రెండో ప్లేస్?లో ఉంది. ఆ తర్వాత ఒక్కో పాయింట్?తో వేల్స్, పాకిస్థాన్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే పట్టికలో టాప్ 2లో నిలిచిన జట్లు మాత్రమే తదుపరి దశకు చేరుకుంటాయి.

26–5–26 rakshana main_Layout 1 8/18/2026 4:39 AM Page 4





## సమంత మరో స్టార్ కి నో చెప్పిందా?

టాలీవుడ్ - కోలీవుడ్ పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేకమైన స్థానాన్ని ఏర్పరచుకున్న స్టార్ హీరోయిన్ సమంత గురించి ప్రస్తుతం ఫిల్మ్ నగర్ సర్కిల్స్‌లో ఓ వార్త చర్చనీయాంశమవుతోంది. అగ్ర నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న ఓ ప్రతిష్టాత్మక చిత్రంలో నటించే అవకాశాన్ని సామ్ సున్నితంగా తిరస్కరించినట్లు తెలుస్తోంది. టాలీవుడ్ కు చెందిన ఓ స్టార్ హీరో సరసన నటించాల్సిన ఈ భారీ ప్రాజెక్ట్‌కు సమంత నో చెప్పడం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈ ప్రాజెక్ట్ ఇప్పుడే పట్టాలెక్కేది కాదని, సరిగ్గా ఏడాది తర్వాత ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. సుదీర్ఘ కాలం పాటు సెట్స్‌లో ఉండాల్సిన ఈ ప్రాజెక్ట్ షెడ్యూల్స్ ... భవిష్యత్ ప్రణాళికలు తన ప్రస్తుత వ్యక్తిగత, వృత్తిపరమైన ఆలోచనలకు సరిపడకపోవడంతోనే సమంత ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ భారీ బడ్జెట్ చిత్రానికి సామ్ డేట్స్ కేటాయించలేనని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా సమంత సినిమాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ఆస్కారం ఉన్న బలమైన పాత్రలను మాత్రమే ఎంచుకుంటున్నారు. అలాగే సమంత ఆరోగ్యం, మానసిక ప్రశాంతతకు ప్రాధాన్యతనిస్తూ ప్రాజెక్ట్‌లను అంగీకరిస్తున్నారు. ఏడాది తర్వాత ప్రారంభమయ్యే ఈ ప్రాజెక్ట్ కోసం ఇప్పుడే కమిట్ అయితే ఇతర ప్రణాళికలకు ఆటంకం ఏర్పడుతుందనే ఉద్దేశంతోనే సమంత ఈ ఆఫర్‌ను వదులుకుంటుంది అన్నది మరో వెర్షన్. మరోవైపు అగ్ర నిర్మాణ సంస్థ - స్టార్ హీరో సినిమా కావడంతో సమంత ఈ ఆఫర్‌ను తిరస్కరించడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. సాధారణంగా ఇలాంటి పెద్ద ప్రాజెక్ట్‌లను నటీనటులు వదులుకోవడానికి సాహసించరు. కానీ సమంత మాత్రం తాను తీసుకునే నిర్ణయాలపై ఎంతో స్పష్టతతో ఉంటానని మరోసారి నిరూపించారు. కథలో కొత్తదనం .. పాత్ర ప్రాధాన్యతను బట్టే అడుగులు వేస్తున్నారని ఈ ఘటన ద్వారా స్పష్టమవుతోంది.

## చిరంజీవి పాత్రను ఎలివేట్ చేసేలా బాబీ సినిమా



మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ మూవీకి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు మెగా అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. భారీ యాక్షన్ షెడ్యూల్‌లో భాగంగా కీలకమైన పోరాట సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్స్ రామ్,లక్ష్మణ్ మాస్టర్స్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో ఫైటర్లతో ఈ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. సినిమాలో యాక్షన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉండటంతో ఈ సన్నివేశాలను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి అభిమానులను ఆకట్టుకునేలా యాక్షన్ ఎపిసోడ్స్‌ను డిజైన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమా నుంచి మరో క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న యాక్షన్ షెడ్యూల్ పూర్తయిన తర్వాత వచ్చే వారం నుంచి స్పెషల్ సాంగ్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ పాటలో చిరంజీవి పూర్తిగా స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారట. ఈ స్పెషల్ సాంగ్ కోసం మెగాస్టార్ లుక్‌ను ఇప్పటికే లాక్ చేసినట్లు సమాచారం. చిరంజీవి ఎనర్జీకి తగ్గట్టుగా పాటను డిజైన్ చేస్తున్నారని, తెరపై ఆయన స్టైలిష్ అవతార్ అభిమానులను మెస్మరైజ్ చేయడం ఖాయమని చిత్ర వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో చిరంజీవి పాత్రను దర్శకుడు బాబీ చాలా ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. మెగాస్టార్ పాత్రలో పలు రకాల వేరియేషన్స్ ఉంటాయని సమాచారం. ఇప్పటివరకు చిరంజీవిని చూడని ఓ కొత్త కోణంలో ప్రేక్షకులకు చూపించాలనే ఉద్దేశంతో బాబీ ఈ కథను సిద్ధం చేసినట్లు టాక్. అదే సమయంలో సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కూడా పెద్దపీట వేస్తున్నట్లు తెలుస్తోంది. యాక్షన్, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామాతో పాటు చిరంజీవి స్టైల్, కామెడీ, మాస్ ఎలిమెంట్స్‌ను మేళవించి కథను రూపొందిస్తున్నట్లు సమాచారం.



## ముంతాజ్ ఐకానిక్ లుక్‌ను గుర్తు చేసిన శోభిత.. ఆరెంజ్ శారీలో ఫ్యాషన్ గోల్స్!

టాలీవుడ్ హాట్ బ్యూటీ శోభితా ధూళిపాళ్ల గ్లోబల్ స్థాయిలో తనదైన స్టైల్‌తో మెప్పిస్తు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కొత్త ఫోటోలు ఇప్పుడు నెట్టింట సంచలనం సృష్టిస్తున్నాయి. కాంతివంతమైన ఆరెంజ్ రంగు సారీలో వింటేజ్ వైబ్స్, మోడరన్ గ్లామర్ కలగలిపిన రూపంతో అందరినీ ఆకట్టుకున్నారు. బాలీవుడ్ ఐకానిక్ నటి ముంతాజ్ క్లాసిక్ శారీ లుక్‌ను రీక్రియేట్ చేస్తూ ఆమె ఇచ్చిన పోజులు ఫ్యాషన్ ప్రియులకు సరికొత్త గోల్స్ ఇస్తున్నాయి. ఆ విశేషాలు చూద్దాం.. పచ్చని ప్రకృతి నేపథ్యం ముందు శోభితా ఆరెంజ్ రంగు బంధేజ్ పాటర్న్ చీరలో, దానికి తగినట్లుగా డిజైన్ చేసిన బ్యాక్‌లెస్ బ్లౌజ్‌లో మెరిసిపోయారు. ఇక సూర్యాస్తమయం వెలుగులో ఆమె కట్టిన చీర, ఎంబ్రాయిడరీ బోర్డర్ కాంతివంతంగా మెరుస్తూ రాయల్ లుక్‌ను ఇచ్చాయి. ఈ ఫొటోషూట్‌లో శోభితా నవ్వు, ఆమె ఒలికించిన సొగసు కుర్రకారును మైమరపిస్తున్నాయి. ఈ ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేస్తూ శోభితా రాసుకొచ్చిన క్యాప్షన్ మరింత ఆసక్తికరంగా మారింది. "ఆరెంజ్ ట్యాంగ్, పింట్రెస్ట్‌లో ముంతాజ్ చీర పిక్, సూర్యాస్తమయం, నిన్న రాత్రి ఫ్రిజ్‌లో దాచిన గాజర్ కా హల్వా, మరియు ససురాల్ గెందా పూల్ పాట.. వీటి నుంచే నాకు ఈ లుక్ స్ఫూర్తి లభించింది" అంటూ సరదాగా చెప్పుకొచ్చారు. ఇక ప్రతి అంశాన్ని తన శైలికి అనుగుణంగా మలచుకుని అద్భుతంగా మెరిశారు.

## రాముడి సుగుణాలు కనిపించాలంటే

### రావణుడి పాత్ర బలంగా ఉండాల్సిందే: యశ్

కన్నడ స్టార్ యశ్ ప్రస్తుతం 'టాక్సిక్', 'రామాయణ' చిత్రాలతో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'రామాయణ' గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. రావణుడి పాత్రకి ఎందుకు ఓకే చెప్పారో వెల్లడించగా.. ఆ సమాధానం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. రాముడి మంచితనాన్ని, సుగుణాలను చూపించాలంటే రావణుడి పాత్రలో బాగా నటించాలి. నేను విలన్ పాత్రలకు న్యాయం చేయగలను. మంచి పాత్రలు చేసినా నావంతు ప్రయత్నం తప్పకుండా చేస్తాను. 'రామాయణ' కోసం మేమంతా ఇగోని పక్కన పెట్టాం. బెస్ట్ టీమ్‌తో కలిసి పనిచేస్తున్నాం. రామాయణం గురించి ప్రతి ఒక్కరికీ తెలిసే ఉంటుంది. నేను చిన్నప్పుడు మా తాత చెబితే ఒకలాగా ఊహించుకునే వాడిని. టీవీలో, సినిమాల్లో చూసిన తర్వాత ఆ ఊహ మారింది. అందరికీ తెలిసిన కథైనప్పటికీ దాన్ని కొత్తగా చూపించగలగాలి. అలా అని మతపరమైన భావాలను దెబ్బతీయకూడదు. ఇది చాలా కష్టమైన పని. నా స్నేహితుడు నమిత్ మల్హోత్రా ఈ సినిమా కోసం బాగా రిస్క్ తీసుకుంటున్నారు. ప్రేక్షకులు దీన్ని ఆదరిస్తారని నమ్ముతున్నానని యశ్ పేర్కొన్నారు. నితీశ్ తివారి దర్శకత్వంలో ముస్తాబైన ఈ బహుభాషా చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించగా.. సీత పాత్రను సాయిపల్లవి పోషించారు. యశ్ ఇందులో రావణుడి పాత్ర పోషిస్తూనే నమిత్ మల్హోత్రాతో కలిసి నిర్మించారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. 'రామాయణ: పార్ట్ 1' ఈ దీపావళికి విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఇటీవల ట్రైలర్‌ని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇక, యశ్ మరో సినిమా 'టాక్సిక్'.. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ మూవీలో కియారా అడ్వాణీ, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషించారు.



Publisher & Printer: G. Narendra, C.G. Palem, Bapatla, Bapatla District